www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 25 జులై 2025
5
చిత్తూరు

బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలి: కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగర అభివృద్ధికి ప్రతి ఉద్యోగి తమతమ బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని నగర కమిషనర్ నరసింహప్రసాద్ సూచించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలోని ఇంజనీరింగ్, రెవెన్యూ సెక్షన్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉద్యోగులు అలసత్వం లేకుండా ప్రజాప్రయోజనాల కోసం సేవలు అందించాలని తెలిపారు. వివిధ పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయాన్ని ఆశ్రయించే ప్రజలకు సత్వర సేవలను అందించాలన్నారు.

ఇంజనీరింగ్ విభాగాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు

- వీఆర్వోలు, విలేజ్ సర్వేర్లు బాధ్యతగా పనిచేయండి - ప్రజల సమస్యల పరిష్కారంపై రెవెన్యూ యంత్రాంగం దృష్టి పెట్టండి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశాభావంతో రెవెన్యూ కార్యాలయాలకు వస్తారని, సమస్యల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో పుంగనూరు, పలమనేరు మండలాల తహశీల్దార్లు, మండల సర్వేయర్‌లు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో జిల్లా కలెక్టర్, డిఆర్‌ఓ మోహన్ కుమార్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ శాఖకు సంబంధించి రికార్డుల నిర్వహణ, రక్షణ బాధ్యత రెవెన్యూ అధికారులదేనని, రికార్డుల నిర్వహణ సక్రమంగా జరిగినట్లయితే ప్రజాసమస్యలను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలకు క్షేత్రస్థాయిలో సరైన విచారణ జరిపి న్యాయం చేకూర్చి, సంతృప్త స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. మండల స్థాయిలో ప్రజల నుండి అందిన అర్జీలకు మండల స్థాయిలోనే సాధ్యమైనంత వరకు పరిష్కారం చూపాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని, సరియైన కారణం ఉంటేనే జిల్లా స్థాయి పీజిఆర్‌ఎస్‌కు పంపాలని సూచించారు. సరైన కారణాలు లేకుండా అర్జీలను తిరస్కరించవద్దని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నియమ నిబంధనల మేరకు ప్రజలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందాలని అవినీతికి తావు లేకుండా రెవెన్యూ యంత్రాంగం పనిచేయాలని తెలిపారు. రెవెన్యూ శాఖ పనితీరుపై ప్రజల నుండి రైతుల నుండి ప్రజాభిప్రాయ సేకరణ చేయడం జరుగుతుంది, అవినీతి జరిగినట్లు తమ దృష్టికి వస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. రాజకీయ మిత్రులకు లొంగవద్దని ఉద్యోగ ధర్మాన్ని విస్మరించవద్దని సూచించారు. రెవెన్యూ సిబ్బందిపై దాడులు జరిగినట్లయితే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి అర్జీని నిర్దేశిత సమయంలోపు పరిష్కరించాలని తెలిపారు. బియాండ్ ఎస్‌ఎల్‌ఎ అర్జీలను గరిష్టంగా ఐదు రోజులలోపు పరిష్కరించాలని లేని పక్షంలో చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. మండలాలలో సమస్యల పరిష్కారంలో డిప్యూటీ తహశీల్దారులకు, తహశీల్దార్లకు వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు సహకరించాలని తెలిపారు. ప్రతివారం నిర్వహించే పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో పొందుతున్న దాదాపు 400 అర్జీలలో 300 పై చిలుకు రెవెన్యూ, రీ సర్వేకు సంబంధించిన అర్జీలు అందుతున్నాయని వీటికి సంబంధించి సరైన రీతిలో ఎండార్స్మెంట్ చేసి సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపాలని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది తమ సమస్యలను విన్నవించుకోవడానికి ప్రతి మూడవ శనివారం సాయంత్రం 5గంటల తర్వాత జిల్లా కేంద్రంలోని డిఆర్‌ఓను సంప్రదించవచ్చని సూచించారు. పలమనేరు ఆర్‌డిఓ భవాని పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

డ్రాపౌట్లు లేని జిల్లాగా మారాలి

విద్యా ప్రమాణాలు పెరగాలి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారికి ప్రభుత్వం అనేక వసతులను కల్పిస్తుందని, పుస్తకాలు, యూనిఫారంలు, బూట్లు తదితర అవసరాలన్నిటిని కల్పిస్తూ తల్లికి వందనం కూడా ప్రభుత్వం అందిస్తోందని, అయినప్పటికీ పిల్లలు బడి మానివేయడం అనేది ఆందోళన కలిగిస్తున్న అంశమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, జిల్లా విద్యాశాఖ, సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారులు, ఆయా మండలాల క్లస్టర్ ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడేల్, డీఈవో వరలక్ష్మి, సర్వశిక్ష అభియాన్ అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 4,447 మంది డ్రాప్ ఔట్లు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని, బడి మాని వేసిన ప్రతి విద్యార్థి ఇంటికి హెడ్ మాస్టర్ వెళ్లి మాట్లాడాలని, విద్యార్థి పరిస్థితిని తెలుసుకొని బడిలో చేర్పించాలని తెలిపారు. పాఠశాలలో ప్రతి తరగతి వారీగా గత రెండు సంవత్సరాలు 2023-24, 2024-25లలో చదివిన ప్రతి విద్యార్థి ప్రస్తుతం 2025-26 సంవత్సరాలలో కొనసాగుతున్నారా లేదా గుర్తించి విద్యను కొనసాగించిన విద్యార్థులను డ్రాప్ అవుట్‌గా గుర్తించాలన్నారు. గుర్తించిన డ్రాప్ అవుట్ విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని వారి ఇంటికి కనీసం ఐదుసార్లు అయినా సందర్శించి వారి తల్లిదండ్రుల విద్యార్థులతో విద్య ఆవశ్యకతను చర్చించి ఆ విద్యార్థులను పాఠశాలలలో తిరిగి చేర్చవలనని తెలిపారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లలో వసతులతో పాటు, విద్యార్థుల నమోదు శాతం పెంచాలని తెలిపారు. క్లస్టర్ హెడ్ మాస్టర్లు కూడా ప్రతి పాఠశాలను పర్యవేక్షిస్తూ తగిన సూచనలు సలహాలు ద్వారా తమ పరిధిలోని పాఠశాలలో సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుడు విద్యార్థులతో వీలున్నంత ఎక్కువ సమయం గడపాలని, అప్పుడే విద్యార్థి మానసిక పరిస్థితి తెలుస్తుందని, వారికీ ఆత్మ స్థైర్యం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమర్థత గల ఉపాధ్యాయులు ఉంటారని, అయితే వీరు విద్యార్థుల పై ఎక్కువ దృష్టి పెట్టాలని, వారికీ సన్నిహితంగా ఉండాలని అప్పుడే వారి లోని లోపాలను తెలుసుకోగలుగుతారని అన్నారు. ఈ ఏడాది 10 ఫలితాలు మెరుగ్గా ఉండాలని, ప్రభుత్వం ఎప్పుడూ లేని విధంగా చదువు పై ఎక్కువ దృష్టి పెట్టి , ఎక్కువుగా ఖర్చు చేస్తోందని దాని ఫలితం కనపడాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, హెడ్మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ, సర్వశిక్ష అభియాన్ అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

శాస్త్రీయ విద్య అందించాలి

- **సంక్షేమ హాస్టల్స్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి**

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రస్తుతం ఉన్న విద్యను శాస్త్రీయ విద్యగా మార్చి అందించాలని, సంక్షేమ హాస్టల్స్‌లోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ సాంస్కృతిక కన్వీనర్ పార్థసారథి దేశభక్తి గేయాలు పాడి విద్యార్థులకు ఉత్తేజపరిచారు. అనంతరం గంగరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సమాజాన్ని కూడా అధ్యయనం చేయాలన్నారు. దేశ స్వాతంత్ర్యాన్ని గురించి అందరికీ తెలుసుకోవడానికి ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించబడుతున్నామని అందులో విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను కనబరచాలని తెలిపారు. ఈ పోటీలలో అధిక ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేయబడతాయని తెలిపారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తున్నారని చదివిన తర్వాత పిల్లలకు ఉపాధి లేకుండా నిరుద్యోగులుగా మారుతున్నారని పాలకుల విధానాలలో మార్పు తీసుకువచ్చి చదువుకున్న వారికి ఉపాధి కల్పించే పద్ధతులు చర్యలు తీసుకోవాలన్నారు. చిత్తూరు జిల్లా నలుమూలల నుండి పేద విద్యార్థులు హాస్టల్లో చదువుకుంటున్నారని హాస్టల్‌లో అధునాతన సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. సౌకర్యాలు బాగా ఉంటే కార్పొరేట్ విద్యార్థులతో పోటీపడి ప్రభుత్వ హాస్టల్స్, స్కూల్స్‌లో విద్యార్థులు చదువుకుంటారని ఉన్న చోట అధిగమించారని తెలిపారు. ఉన్నత చదువుతున్న విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించాలన్నారు. రాబోయేది వర్షాకాలమని దోమలు తీవ్రంగా ఉన్నాయని వాటిని నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అనే నినాదంతో విద్యార్థులకు అన్ని రకాల కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అయ్యే విధంగా మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు చేసుకొని ఉన్నత చదువులు అధిరోహించాలని కోరారు. అలాగే నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ అధ్యక్షులుగా చరణ్, కార్యదర్శిగా రోహిత్, కమిటీ సభ్యులుగా కిరణ్ కుమార్ యశ్వంత్, విజయ్, ప్రదీప్ నాయక్, రవి, మనోహర్, సాయి, హర్షవర్ధన్ ఎన్నికైయ్యారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న వాడ గంగరాజు

ఒప్పంద అధ్యాపకుల సర్వీసు పునరుద్ధరణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పివికేఎన్ ప్రభుత్వ కళాశాలలో ఒప్పంద అధ్యాపకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న 50 మంది అధ్యాపకులకు 2025-2026 విద్యా సంవత్సరానికి సర్వీసు పునరుద్ధరణ చేశారు. ఈ కార్యక్రమంలో పివికేఎన్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగేంద్ర జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, విజయ వేలురెడ్డి, వేణుగోపాల్, షణ్ముగం, చిదంబరం, శ్రీనివాస్, అన్నపూర్ణ, శారద పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకుల కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న జేసి విద్యాధరి

ఉచిత బస్సు ప్రయాణానికి వేళాయె

ప్రజాశక్తి- పుంగనూరు: మహిళలు ఎప్పుడెప్పుడా.. అని ఎదురుచూస్తున్న ఉచిత బస్సు ప్రయాణానికి ఆగస్టు 15 నుంచి శ్రీకారం చుట్టనున్నట్లు కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు వాటికి అవసరమయ్యే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు రాకపోయినప్పటికీ ప్రారంభ తేదీ ఖరారు కావడంతో ఆ దిశగా చర్యలు చేపట్టనున్నారు. పుంగనూరు డిపోలో మొత్తం బస్సులు 82 ఉన్నాయి. ఈ బస్సుల్లో నిత్యం 19వేల మంది వరకు ప్రయాణికులు ప్రయాణిస్తున్నట్లు రోజుకు సుమారుగా 31 వేల కిలోమీటర్లు తిరుగుతున్నట్లు ఇంచార్జ్ డిపో మేనేజర్ పావని తెలిపారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించి విధివిధానాలు రావలసి ఉందన్నారు. మహిళలతో మర్యాదగా మాట్లాడాలని కండక్టర్ డ్రైవర్లకు ప్రత్యేక సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణ మహిళలకు ప్రత్యేక సీట్లు కేటాయిస్తారని చెప్పారు. మహిళల తాకిడి ఎక్కువగా ఉండే సమయం ఉదయం 8 నుండి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7గంటల వరకు రద్దీగా ఉండవచ్చునని అంచనాలు వేస్తున్నారు. పుంగనూరు డిపో పరిధిలో తిరుగుతున్న బస్సుల్లో ఎంతమంది ప్రయాణిస్తున్నారు..? ఉచిత పథకం అమలులోకి వస్తే రద్దీ ఎంత మేరకు పెరుగుతుంది..? తదితర అంశాలపై అంచనాలు వేస్తున్నారు. ప్రయాణికుల ప్రాంగణాలలో మౌలిక వసతులు, వేచి ఉండటానికి సదుపాయాలు ఉన్నవాటిని మరింత మెరుగుపరుస్తున్నారు. ప్రయాణించే మహిళలకు ఉచిత టికెట్లు జారీ చేస్తారు.

నీటి సరఫరాను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వార్డుల్లో పారిశుద్ధ్యం, నీటి సరఫరాను పక్కాగా పర్యవేక్షించాలని నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కమిషనర్ గురువారం 21వ వార్డు పరిధిలో వరిగపల్లి, 6వ వార్డు పరిధిలో సంజయ్ గాంధీనగర్‌లో పారిశుద్ధ్యం, నీటి సరఫరా తీరును పరిశీలించారు. వరిగపల్లి హరిజనవాడలో ట్యాంకును, నీటి సరఫరా పైపులైను పరిశీలించారు. పైప్ లైన్లు లీకేజీ లేకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని, ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా సక్రమంగా చేస్తున్నారా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సంజయ్ గాంధీ నగర్ కాలనీలోని బాలికల గురుకుల పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. గురుకుల పాఠశాల ఆవరణలోని ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. కమిషనర్ వెంట ఎంహెచ్వో డాక్టర్ పి.లోకేష్, ఏఈ లోకేష్, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలు తనిఖీ చేస్తున్న నగర కమీషనర్

ఉపాధి హామీతోనే పేదరిక నిర్మూలన : పీడీ

ప్రజాశక్తి- వి కోట: పేదలు వ్యవసాయ కూలీలకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించడంతో పేదరికం నిర్మూలించగలుగుతున్నామని చిత్తూరు డ్వామ పీడీ రవికుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024 - 25 సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బహిరంగ సభ ప్రాజెక్ట్ అధికారి ఎంపీడీవో శివన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో గడచిన ఆర్థిక సంవత్సరంలో మొత్తం 1955 పనులకు గాను రూ12.24 కోట్ల రూపాయలకు సంబంధించి గత నెల 2 నుండి క్షేత్రస్థాయిలో తనిఖీ సిబ్బంది తనిఖీ చేసి పనులను పరిశీలించారు. వీటికి సంబంధించి సంబంధిత గ్రామపంచాయతీలలో గ్రామసభలు ప్రజల సమక్షంలో నిర్వహించి చేపట్టిన పనుల వివరాలను చర్చించారు. గురువారం నిర్వహించిన సమావేశానికి డ్వామా పీడీ రవికుమార్ హాజరై సమావేశంలో గ్రామ పంచాయతీల వారి తనిఖీ బృందం అందించిన సమాచారాన్ని పరిశీలించారు. కూలీలకు సంబంధించిన జాబ్ కార్డులు సక్రమంగా వివరాలు నమోదు చేయకపోవడం, పని ప్రదేశాల్లో కొన్నిచోట్ల ప్రభుత్వ ఆదేశాల మేరకు కూలీలకు తాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ కిట్లు సదుపాయం కల్పించకపోవడాన్ని గుర్తించినట్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధి హామీ కింద చేపట్టిన పండ్లు, పూల తోటలు పెంపకంలో క్షేత్రస్థాయిలో ఉండాల్సిన మొక్కల కంటే తక్కువ ఉన్నట్లు అయినప్పటికీ మొత్తానికి సిబ్బంది బిల్లులు చెల్లించినట్లు తనిఖీ బృందం గుర్తించి తనిఖీ బృందం సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. చెరువులలో కూడికతీతలో కొలతలు తేడాలను తనిఖీ బృందం గుర్తించింది ఈ తనిఖీలలో భాగంగా పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన సిమెంట్ రోడ్లు ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల తో పాటు క్షేత్రస్థాయిలో చేపట్టిన పనులకు సంబంధించి నేమ్ బోర్డులు తదితర పనులకు సంబంధించి రు.3.22 లక్ష రూపాయలు రికవరీ కి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ మేఘన సునీల్, ఎస్టీఎం లోకేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో ఈశ్వరన్న, ఏపీఓ గౌరీ శంకర్ ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్లో గుంతలమయంగా రోడ్లు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. తేలికపాటి వర్షాలకే గుంతల్లో వర్షపు నీరు చేరి ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్న పరిస్థితి. ఇది చాలదన్నట్లు ఆ గుంతల్లోని నీటిలో వ్యర్థాలు చేరి దోమలకు నిలయంగా మారుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం ప్రయాణికులకు దోమ బాధ తప్పడం లేదు. బస్టాండ్‌కు అడ్డంగా వేసిన రాళ్ల వలన ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల గురవుతూ నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయమై ఆరు నెలల ముందు ప్రజాశక్తిలో వార్త ప్రచురించగా అప్పుడు కంటి తుడుపు చర్యగా ఆర్టీసీ డిపో మేనేజరు సంబంధిత అధికారులు హాజరై బస్టాండ్‌లో రోడ్ల మరమ్మతులకు కొలతలు తీసుకుని ఫోటోలు తీసుకొని గుంతలు పూడ్చివేసి రోడ్లు మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు కానీ ఇప్పటిదాకా కనీసం ఒక పార మట్టి కూడా వేసిన దాఖలాలు లేవు. బస్సులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం, ప్రైవేటు వాహనాలు ఇష్టం వచ్చినట్లు బస్టాండ్లో నిలపడం వలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎయిమ్స్‌ఆర్‌లో సిమ్యులేషన్ బోధనపై వర్క్‌షాప్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మెడికల్ విద్యలో బోధన, అభ్యాసం, మూల్యాంకనంలో సిమ్యులేషన్ టెక్నాలజీ వినియోగంపై చిత్తూరులోని అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లో గురువారం ఫ్యాకల్టీ అభివృద్ధి వర్క్‌షాప్ నిర్వహించారు. డాక్టర్ ప్రతాప్ సీ.రెడ్డి నాలెడ్జ్ సెంటర్‌లోని సెమినార్ హాల్‌లో జరిగిన ఈకార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభించిన అకడెమిక్స్ అసోసియేట్ డీన్, మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్ మాట్లాడుతూ మెడికల్ విద్యార్థులలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సిమ్యులేషన్ ఒక కీలక సాధనంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఎయిమ్స్‌ఆర్ కరికులం కమిటీ సభ్యులు డాక్టర్ ఓ. సిద్ధార్థ్, డాక్టర్ లోకేష్ బీ రిసోర్స్ ఫ్యాకల్టీగా వర్క్‌షాప్‌ను నిర్వహించారు. సిమ్యులేషన్‌ను ఉపాధ్యాయులు బోధన, అభ్యాసం, మూల్యాంకన సాధనంగా ఎలా ఉపయోగించవచ్చో ప్రాథమిక అవగాహన కల్పించారు.

సిమ్యులేషన్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్న వైద్యనిపుణులు

ప్రభుత్వ సేవల పట్ల ప్రజల సంతృప్తి స్థాయి పెంచాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రభుత్వ సేవల పట్ల ప్రజల సంతృప్తి స్థాయి పెంచేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యకాదర్శి కె. విజయానంద్ ఆదేశించారు. రాష్ట్ర సెక్రటేరియట్ నుండి ప్రభుత్వ సేవల పట్ల ప్రజల సంతృప్తి స్థాయి, పీ4, సీజనల్ వ్యాధుల నియంత్రణ, తదితర అంశాలపై వివిధ శాఖల రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సమీక్షించారు. చిత్తూరు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా అధికారులతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుక పంపిణీ, పేదలకు గృహ నిర్మాణం, విద్యుత్ సరఫరా, తదితర సేవలలో ప్రజలు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిష్కరించి ఆయా సేవల పట్ల ప్రజలు సంతృప్తి స్థాయిని మరింత పెంచేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. విద్యుత్ పంపిణీలో ఓల్టేజ్ వంటి ఎటువంటి సమస్యలు లేకుండా నాణ్యమైన విద్యుత్ పంపిణీకి చర్యలు తీసుకోవాలని, ఉచిత ఇసుక పంపిణీ విధానంలో ప్రజలు ఇబ్బంది లేకుండా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పేదల గృహ నిర్మాణంలో వారి సమస్యలు తెలుసుకుని, నిర్మాణ సామాగ్రి, సాంకేతిక సహకారం అందించేలా గృహ నిర్మాణ శాఖ అధికారులు చూడాలన్నారు. ఆగష్టు, 15 వ తేదీలోగా రాష్ట్రంలో 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో అనుసంధానం చేసి, బంగారు కుటుంబాలు అభివృద్ధి దిశగా పయనించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సభలు నిర్వహించి బంగారు కుటుంబాల అభివృద్ధికి అవసరమైన 'నీడ్స్ అసెస్మెంట్ సర్వే' నిర్వహించి, వాటిని మార్గదర్శకులకు తెలియజేసి,బంగారు కుటుంబాలను మార్గదర్శిలతో అనుసందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ పీ- 4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శిలా గుర్తింపు అనుసంధానంలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేస్తామన్నారు. అన్ని శాఖల సహకారంతో పై కార్యక్రమాలను విజయవంతం చేయడానికి కృషి చేయడం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి

ఘనంగా విజయానంద రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: వైఎస్ఆర్సిపి చిత్తూరు నియోజకవర్గ ఇన్చార్జి ఎంసి విజయానందరెడ్డి పుట్టినరోజు వేడుకలను గురువారం మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49. కొత్తపల్లి మిట్టలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాము ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం కొత్తపల్లి మిట్ట వాణిజ్యకూడలిలో వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి భారీ కేక్ కట్ చేసి స్వీట్స్, మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చాక్లెట్లు పంచారు. కార్యక్రమంలో కుప్పయ్య, విజయబాబు, కోటిరెడ్డి బాబు, సుధాకర్, జనార్ధన్, చంద్రశేఖర్, యాకుబ్, యేసురత్నం, గోవింద రెడ్డి, భువనేష్ పాల్గొన్నారు.

విజయానంద రెడ్డి జన్మదిన వేడుకల్లో

పండ్ల మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: తమ అభిమాని నాయకుడు ఎంసి.విజయానంద రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం స్థానిక సర్పంచ్ డివి.డిల్లెయ్య కుమారుడు పవన్ ప్రసాద్ ఆధ్వర్యంలో కొత్తపల్లి మిట్లలో పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. విజయానంద రెడ్డి అంచెలంచెలుగా ఎదిగార్న దానికి గుర్తుగా పండ్ల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ విజయబాబు, జిల్లా అధికార ప్రతినిధి కోదండన్, గోవిందస్వామి, మార్కొండయ్య, గోవిందయ్య, బాబు, గోవిందయ్య, కోటిరెడ్డి బాబు, దేవరాజుల రెడ్డి, విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు దొరస్వామి, సుధాకర్, రిటైర్డ్ టీచర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వంట పాత్రలు వితరణ

వంట పాత్రలను అందజేస్తున్న వినోద్ నాయుడు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: తూగుండ్రం ఉన్నత పాఠశాలకు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వంట పాత్రలు విరాళంగా అందజేశారు. వరత్తూరు పంచాయతీ కనికాపురం గ్రామానికి చెందిన వినోద్ నాయుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. గురువారం ఆయన రూ.15వేలు విలువ చేసే వంట పాత్రలను హెచ్.ఎం. రాజేంద్ర నాయుడుకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు విద్య కుంటుపడరాదని మధ్యాహ్నం భోజనంతో విద్యార్థులకు చేయూత అందిస్తురన్నారు. సేవా దృక్పథంతో తమ వంతు సహాయంగా తూగుండ్రం హై స్కూల్‌కు వంట పాత్రలను విరాళంగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ సుధాకర్, మాజీ సర్పంచ్ నియాజ్ అలీ, తూగుండ్రం పిహెచ్సి మాజీ అభివృద్ధి కమిటీ చైర్మన్ నరసింహులునాయుడు, ఉపాధ్యాయులు చంద్రమనాయుడు, దేవరాజులు, పాల్గొన్నారు.

నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం..!

టిడిపి మండల కన్వీనర్ ఆనంద్ రెడ్డి

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని చిన్న బల్దారు ఉన్నత పాఠశాలలో అర్ధాంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు వెంటనే చర్యలు చేపడతామని టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి తెలిపారు. గురువారం పాఠశాలను, మధ్యాహ్న భోజనాన్ని నేతలతో కలిసి పరిశీలించారు. భవన నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లి పాఠశాలలో కావాల్సిన వసంతలను కల్పించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. పాఠశాలలో ఏర్పడుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూపతిరెడ్డి, నేతలు నందారెడ్డి, వెంకటరెడ్డి, మురళీమోహన్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

జీతాల పెంపుపై కార్మికుల హర్షం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మున్సిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతాల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఇంజనింగ్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట రాష్ట్ర ముఖ్యమంత్రి, డిప్యూటీ సిఎం, మున్సిపల్‌శాఖ మంత్రి చిత్రపాఠాలకు పాలాభిషేకం చేశారు. అలాగే జీతాల పెంపుకు కృషి చేసిన ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికుల సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా 25 సంవత్సరాల తరువాత రూ.3,500లు జీతం పెంచడంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు.
పలమనేరు: మున్సిపల్ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి చిత్రపటాలకు ఇంజనీరింగ్ ఔట్సోర్సింగ్ కార్మికులు పాలాభిషేకం చేశారు.

సుబ్రహ్మణ్యం మృతికి నివాళి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట గ్రామంలో వైఎస్ఆర్సిపి కార్యకర్త సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. దీంతో మండలం వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాము, జిల్లా సాంస్కృతిక విభాగము కమిటీ సభ్యులు శేషాద్రి, నాయకులు సుబ్రహ్మణ్యం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి వెంట ధరణి, భరత్, కిరణ్, సాయి, ధనుష్ కానిక రాజు, మణి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలను పరిరక్షించండి

మాజీ ఎంపి చింతామోహన్

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని కాంగ్రెస్ శ్రేణుల నిరసన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ పాథమిక పాఠశాలలను పరిరక్షించాలని కోరుతూ గురువారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్‌పార్టీ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి చింతామోహన్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. పేద వర్గాలు చదువుకొనే ప్రభుత్వ పాఠశాలలను నిర్వీయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం విలీనం పేరిట మాడల్ పాఠశాల మాయతో ప్రభుత్వ విద్యావ్యవస్థను నాశనం చేయడం సరికాదన్నారు. ఎస్సీ, ఎస్టీ మైనార్టీ కార్పొరేషన్లకు బడ్జెట్ కేటాయించి సబ్సిడీ రుణాలు పొందే అవకాశం కల్పించాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ పేదలు, అనగారిన వర్గాల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు.

మహిళలు తలదించుకునేలా రోజా వ్యాఖ్యలు

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

ప్రజాశక్తి- రామకుప్పం: రాష్ట్రంలో మహిళలు తలదించుకునేలా మాజీ మంత్రి రోజా మాట్లాడుతున్నారని, ఆమె వ్యాఖ్యలను మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గౌని వారి శ్రీనివాసులు తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మాజీ మంత్రి రోజా వ్యాఖ్యలు ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేసిందన్నారు. 2014లో రోజాతో సహా వైసిపికి మొత్తం గాలి వాటంతో గెలిచిందన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని దోచుకున్న వైసీపీ బూతుగాళ్లకు, దోపిడీదారులకు అధికారం కోల్పోయే సరికి దోచుకోవడానికి ఏమీ దొరకక పిచ్చిపట్టి ఫ్రెస్టేషన్ వస్తోందన్నారు. బూతులు మాట్లాడిన వారికి మాత్రమే జగన్ రెడ్డి పదవులు ఇచ్చి ప్రోత్సహించారని రోజా పిచ్చిమాటలతో రెచ్చగొట్టడం దొంగ ఏడుపులతో మహానటిగా అలవాటైపోయిందని ఎద్దేవా చేశారు. గతంలో ఆమె మాటతీరు వల్లే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి 11 సీట్లకే ప్రజలు పరిమితం చేశారన్నారు. రాజకీయాలు మాట్లాడేటప్పుడు హుందాగా వ్యవహరించకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

అధికారులకే పరిమితమైన గ్రామసభ

ప్రజాశక్తి- పలమనేరు రూరల్ (గంగవరం): ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారాల కోసం ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన అన్న నినాదంతో పంచాయతీల వారీగా గ్రామసభలు నిర్వహిస్తారు. పలమనేరు రూరల్ మండలం మొరం సచివాలయంలో అలా కాకుండా గురువారం అధికారులు, నాయకులకే గ్రామసభ పరిమితమైందని, ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. ముఖ్యంగా గ్రామసభలు నిర్వహించే ముందు రోజు గ్రామంలో దండోరా వేయించి సభకు అందరూ హాజరుకావాలని సమాచారం అందించి సమావేశాలు నిర్వహించాలని కానీ గ్రామాల్లో ఎక్కడా ప్రజలకు సమాచారం అందించడం లేదని చెబుతున్నారు. ఇకనైనా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల గురించి ప్రజలకు తెలియజేయాలని కోరుతున్నారు.

పేదరిక నిర్మూలన పీ-4తో సాధ్యం

మెప్మా మేనేజర్ బాబా

ప్రజాశక్తి- పలమనేరు: పేదరిక నిర్మూలన లక్ష్యంగా పీ-4 విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని పలమనేరు మున్సిపల్ మెప్మా మేనేజర్ బాబా అన్నారు. గురువారం కొత్తపేట, ఓల్డ్ పేట్-1, టిఎస్ అగ్రహారం సచివాలయలలో నిర్వహించిన పీ-4 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బంగారు కుటుంబాల తుది జాబితా ఆగస్టులో విడుదల చేస్తామన్నారు. దత్తత కార్యక్రమాల ద్వారా బంగారు కుటుంబాలకు విద్య, వైద్యం, మౌలిక వసతులు మెరుగయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

చౌడేశ్వరి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక గిరింపేట సర్కల్‌లోని చౌడేశ్వరి ఆలయంలో గురువారం పార్ధసారథి నాయుడు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలకు పైగా చౌడేశ్వరీ ఆలయంలో ఏటా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : బైరెడ్డిపల్లి మండలంతోపాటు పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, వీ కోట మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో మండల కమిటీలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా డిసిసి ప్రెసిడెంట్ భాస్కర్, పిసిసి కార్యదర్శి బిజె.అనిల్, పలమనేరు కోఆర్డినేటర్ శివశంకర్ తెలిపారు. ప్రతి మండల నౌఉచి 20 మంది సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. రాబోవు స్థానిక ఎన్నికలలో ఈ కమిటీలలోని నాయకుల ద్వారా ఆయా మండలాలలోని కార్యకర్తలను సన్నద్ధం చేసి పార్టీ బలోపేతానికి తోడ్పడవలసినదిగా షర్మిల కోరారు.

హస్త కళలను కాపాడండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి
భారతీయ హస్తకళలు సాంస్కృతిక ప్రతీకలనీ, వాటిని కాపాడాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరధాచారి కోరారు. హస్త కళల పరిరక్షణలో తన వంతు పాటుపడుతున్న జిల్లా కలెక్టర్ అభినందనీయుడని కొనియాడారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వెంకటేశ్వర స్వామి దారు శిల్పాన్ని బహూకరించారు. మిన్నల్ రవి, డా.యం.ఉమేష్ రావు, జయముని ఆచారి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా వంతెన పనులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం, దేవదొడ్డి మధ్య వంతెనను బెంగళూరు -చెన్నై జాతీయ రహదారి పైనుండి నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. డిసెంబర్ లోపల ఈ రోడ్డు పనులను పూర్తి చేయాల్సి ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారు. ఈ వంతెన పైనుండి రోడ్డు ప్రారంభమైనట్లయితే కూతవేటు దూరంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంకు ప్రయాణం సులువుగా మారుతుందని పరిసర గ్రామాల ప్రజలు అంటున్నారు. బైరెడ్డిపల్లి మండల కేంద్రంలో బెంగళూరు -చెన్నై లింకు బస్టాండు ఏర్పడుతుండడం తెలిసిన విషయమే. ఈ బస్టాండుకు అనుసంధానంగా ఉన్న జాతీయ రహదారిపై ఇంకా కొన్ని వంతెనలు పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న ఈ వంతెన పనులవల్ల పరిసరాలలోని గ్రామాల ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు ఇబ్బందికరంగా మారింది, అయితే వంతెన పనులు త్వరగా పూర్తి అయినట్లయితే చుట్టు పక్కల గ్రామాల రైతులు పండించిన పంటలను చాలా సులభంగా పక్క రాష్ట్రానికి సైతం రవాణా చేసుకోవచ్చు అని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వేగవంతంగా జరుగుతున్న వంతెన నిర్మాణం

సారా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తాం..

డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండలంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ విజయశేఖర్ గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సారా రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమేనని, అందులో భాగంగా చిత్తూరు జిల్లాను పూర్తి సారా రహిత జిల్లాగా మార్చేందుకు అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని సారా తయారీ, విక్రయాలు, బెల్టు షాపులపై నిర్వహణపై 14405 ద్వారా సమాచారం ఇవ్వాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే సారా కేసుల్లో పట్టుబడి వృత్తిని విరమించుకొని జీవనం సాగించే వాళ్లకి ప్రభుత్వం తోడుగా నిలబడి వారికి పాడి ఆవులు, ఆటోలు వంటివి ప్రభుత్వం ద్వారా ఇప్పించి మంచి మార్గంలో నడవడానికి కృషి చేస్తామన్నారు. వైన్ షాప్ సమీపంలో పర్మిట్ రూములకు అనుమతి లేవని అలాంటివి ఎక్కడ ఉన్నా టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. డిప్యూటీ కమిషనర్ వెంటఎక్సైజ్ సూరింటెండెంట్ శ్రీనివాస్ కృష్ణ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూరింటెండెంట్ చిత్తూర్ కిషోర్ రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూరింటెండెంట్ ఎన్ఫోర్స్మెంట్ సుబ్రహ్మణ్యం, ఎక్సైజ్ సీఐ శిరీష దేవి, ఎస్ఐ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్

ప్రజల సంక్షేమమే.. కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని, ఏడాది కాలంలోనే ప్రజల మన్ననలు పొందిందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా తంగవేలు కాలనీ, తోటపాళ్యం, వన్నియర్ బ్లాక్, రంచాచారి వీధి వార్డుల్లో పర్యటించారు. వీరభద్ర కాలనీలోని లబ్ధిదారులకు వినాయక చవితి రోజున 25 తొపుడు బండ్లు అందిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక రామకృష్ణ మున్సిపల్ స్కూల్లో విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఫ్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేయర్ ఎస్.అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్.మనోహర్, కాజూరు బాలాజీ, క్లస్టర్, డివిజన్ ఇన్చార్జిలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
రామకుప్పం: రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని సాకలకుప్పంలో సుపరిపాలన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింట ఏడాది పాలనపై ప్రజలనుండి అభిప్రాయాన్ని సేకరించారు. సింగల్ విండో అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, నందరెడ్డి, మురళి మోహన్, ప్రభాకర్ గౌడు, కుమారస్వామి, వెంకట్ రెడ్డి, అప్పన్న, బాబు సాహెబ్, సుగుణమ్మ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు తనిఖీ చేసిన ఎంపీడీవో

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీలో జరుగుతున్న ఇంటింటికీ చెత్తసేకరణ కార్యక్రమాన్ని, అలాగే పంచాయతీ పరిధిలోని చేతి పంపుల పనితీరు పరిస్థితిని, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల క్లోరినేషన్‌ను, ఎస్‌డబ్ల్యుపిసి పనితీరును మండల పరిషత్ అభివృద్ధి అధికారి పురుషోత్తం గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పురుషోత్తం మాట్లాడుతూ ఇంటింటికీ చెత్త సేకరణకి సంబంధించిన ఐవిఆర్ఎస్ కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుధ్యం, ఇంటింటికీ చెత్త సేకరణ, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ క్లీనింగ్, క్లోరినేషన్, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల దగ్గర పారిశుధ్య నిర్వహణ, ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌లో వర్మీ కంపోస్ట్ తయారీ, గ్రామ పంచాయతీ పరిధిలో చాలా రోజులుగా పట్టించుకోకుండా వదిలేసిన పాత వ్యర్థాలను తొలగించడం, చేతి పంపుల నిర్వహణ వంటి కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించవలసిందిగా పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీచేశారు. సర్పంచ్ బండి రాము, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్

గుర్తు తెలీని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని పత్తికొండ పంచాయతీ అటవీ ప్రాంతంలో సుమారు 55 సంవత్సరాలు వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. మృతుడు బ్లూ కలర్ ఫుల్ డ్రాయర్, ఎడమ కాలుకు అడ్డ పట్టీలు గల బ్లూ లుంగీ, పసుపు, నలుపు అడ్డగీతలు గల ఫుల్ షర్టు, ఒక తెల్లటి కట్ బనియన్, ఒక బ్లూ కలర్ టవల్, లుంగీతో పత్తికొండ గ్రామ ఫారెస్ట్‌లో సంద్ర చెట్టుకు ఉరివేసుకొని మరణించినట్లు తెలిపారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, సంఘటనా స్థలానికి సమీపంలో కెఏ07 ఎస్ 3388 నెంబర్ గల ద్విచక్రవాహనం ఉందని తెలిపారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు ఇన్స్పెక్టర్ ఫోన్ నంబర్ 9440796735కు ఫోన్ చేసి తెలపాల్సిందిగా కోరారు.

టమాటా లారీ బోల్తా

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: టమాటా లారీ బోల్తాపడిన సంఘటన గురువారం మండలంలోని మొగిలి ఘాటు వద్ద చోటు చేసుకున్నది. సిఐ శ్రీనివాసులు ఇచ్చిన సమాచారం మేరకు పలమనేరు నుండి మద్రాస్‌కు వెళ్తున్న టమాటా లోడ్ లారీ అదుపుతప్పి రోడ్డుకు పక్కలో బోల్తా పడింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మూడు నెలల తర్వాత మృతదేహం వెలికితీత

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి
- తల్లి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన ఘటన

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని ఓ యువకుడు ఏప్రిల్ 20వ తేదీ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మొదట సాధారణ ప్రమాదంగా భావించి బంధువులు తల్లిదండ్రులు పెనుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ యువకుడు మృతి చెందాడు. మృతి చెందిన యువకుడిని గ్రామానికి తీసుకెళ్లి ఖననం చేశారు. అయితే ప్రచారంలో తమ కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు గ్రహించి గురువారం ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్‌కి మృతిని తల్లి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి విచారణ మొదలుపెట్టారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం పెనుమూరు మండలం పులికల్లు పంచాయతీ గొడుగుమానపల్లి హరిజనవాడ చెందిన అంజలి ఆరుముగం దంపతుల చిన్న కుమారుడు రాజశేఖర్ (29) పక్క రాష్ట్రమైన కర్ణాటకలోని బెంగళూరులో మెడిప్లస్‌లో మెడికల్ రిప్రజెంటివ్‌గా విధులు నిర్వహిస్తుండేవాడు. ఏప్రిల్ 20వ తేదీ బెంగళూరు నుండి స్వగ్రామమైన గొడుగు మానపల్లెకి చేరుకున్నాడు. మండలంలోని కొత్తపల్లి మిట్టకు ఇంటి అవసరమైన సరుకులు తీసుకురావడానికి వెళ్తుతుండగా ఎస్ఆర్ పురం మండలం డీకేమరి పల్లి సర్కిల్ వద్ద ద్విచక్ర వాహనం నుండి అదుపుతప్పి క్రింద పడటంతో తీవ్ర గాయాలతో పెనుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతి చెందిన రాజశేఖర్‌ను స్వగ్రామానికి తీసుకెళ్లి గ్రామస్తులు బంధువులు సమక్షంలో మరుసటి రోజు ఖననం చేశారు. అయితే గురువారం మృతుడి తల్లి అంజలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి ఖననం చేసిన శవాన్ని రెవెన్యూ వారి సమక్షంలో బయటికి తీసి అదే స్థలంలోనే డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతికి గల కారణాలను పరిశీలిస్తామని, విచారణ చేపడతామని మృతిని కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తానని ఎస్ఐ సుమన్ తెలిపారు. కార్వేటినగరం సిఐ హనుమంతప్ప పెనుమూరు తహశీల్దార్ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

'ముక్కంటీశుని' సేవ 'రంగినేనికే'నా..!

స్పష్టం చేసిన ఎంఎల్ఎ బొజ్జల
వారంలో ప్రకటించే అవకాశం
అనూహ్యంగా కోలాఆనంద్ పేరూ...
నైరాశ్యంలో ఆశావాహులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి
రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా, వంద కోట్ల వార్షికాదాయం పొందుతున్న ఆలయాల్లో మూడోదిగా శ్రీకాళహస్తీశ్వరాలయం ఖ్యాతికెక్కింది. ఈ నేపథ్యంలో ఆలయ ధర్మకర్తల మండలి నియామకమూ అంతే ప్రతిష్టాత్మకంగా మారింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటుతున్నా ఇప్పటివరకు ధర్మకర్తల మండలి నియామకం జరగకపోవడం ఆశావహులను బాధిస్తోంది. పాలకమండలి ఛైర్మన్ రేసులో తీవ్ర పోటీ ఉండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. టీడీపీలో ఎమ్మెల్యే బొజ్జల వర్గం, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ వర్గం, జనసేనలో వినుత వర్గం, బీజేపీలో కోలా ఆనంద్ వర్గం ఎవరికి వారు అధిష్టానం ఎదుట ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అయితే నిన్నటి వరకు రంగినేని చెంచయ్య నాయుడు పేరు మాత్రమే ప్రముఖంగా వినిపిస్తూ వస్తోంది. ఆయనకు ఎమ్మెల్యే అండదండలు మెండుగా ఉన్నాయనే కోణంలో ఈ ప్రచారం జరిగింది. అయితే రెండు రోజులుగా మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. ఆయనకి ధర్మకర్తల మండలి చైర్మన్ పదవి ఖరారు అయినట్లుగా కూటమినేతలు ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ధర్మకర్తల మండలి చైర్మన్ పదవి పై గురువారం కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు కూటమి వర్గాల్లో, ఆశావహుల్లో తీవ్ర దుమారాన్ని లేపాయి.

నా మద్దతు రంగినేనికే..!!

శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గా టీడీపీ సీనియర్ నేత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు పేరును మాత్రమే ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద తాను ప్రతిపాదన చేసినట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఆయన గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. చిత్తశుద్ధి ఉన్న వ్యక్తిగా తాను ఆలోచించాకే చెంచయ్య నాయుడు పేరును ప్రతిపాదించినట్లు ఆయన స్పష్టం చేశారు. గడిచిన పదేళ్లుగా చెంచయ్య నాయుడు కుటుంబం టీడీపీకి అండగా నిలుస్తోందని తెలిపారు. ఎన్నో కేసులు పెట్టినా రంగినేని, ఆయన కుటుంబం వెనక్కి తగ్గలేదన్నారు. ఆయన పడ్డ కష్టం, శ్రమ ఆధారంగా కూటమిలో రంగినేని చెంచయ్య నాయుడుకే ధర్మకర్తల మండలి అధ్యక్ష పదవి దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. తన విజయంలో కూటమిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరి సహకారం ఉందన్నారు. వారంలోపు ధర్మకర్తల మండలి ఏర్పాటు అవుతుందని పేర్కొన్నారు. సభ్యుల ఎంపిక అధిష్టాన నిర్ణయమన్నారు. బీజేపీ, జనసేన లో కూటమి విజయంలో పాత్ర, తదితర అంశాలను పరిశీలిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నైరాశ్యంలో ఆశావహులు

ఇప్పటివరకు ధర్మకర్తల మండలి చైర్మన్ రేసులో రంగినేని చెంచయ్య నాయుడు, డాక్టర్ నైనారు పొన్నారావు, రెడ్డివారి గురవారెడ్డి, సత్రవాడ ప్రవీణ్, గాలి చలపతి నాయుడు, కన్నలి ప్రతాపరెడ్డి, కోలా ఆనంద్, కోటా వినుత తండ్రి ఉన్నారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా చెంచయ్య నాయుడితో కూడిన సేవా కమిటీని నియమించడంతో అధికారిక పాలకమండలిలో కూడా వీరే ఉంటారన్న సంకేతాలు వచ్చాయి. అయితే ఎవరికి వారు అధిష్టానం వద్ద మొరపెట్టుకోవడంతో పాలక మండల నియామకం వాయిదా వేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే బొజ్జల చేసిన వ్యాఖ్యలు ఆశావహులను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టేశాయి.

In the Court of the VII th Addl.District Judge Cum Judge Family Court, Ananthapuramu
E.A.No. 23/2025 in E.P.No.882/2018 in O.S.No.70/2012
Between:
Sane Muralidhar (died) by L.Rs.
Sane Chandrakala and Others ...Petitioners/D.Hrs
And
S.Narmada (died) by L.Rs. K.N.Radha, and Others ...Respondants/J.Drs
Notice to J.Dr No:10 and 11
J.Dr.No:10: T.Raghavendra Raju, S/o Late T.Sreedhar Murthy,
J.DrNo:11:T.Krishna Murthy, S/o Late T.Sreedhar Murthy, Both are R/of D.No.14-343, Palace Road, Kuppam Town, Chittoor District.
పై నెంబరు కేసులో J.Drs అయిన మీ హాజరు నిమిత్తము 31-07-2025 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
S. K.Narenedra Reddy, Advocate, Ananthapuamu. Cell:9059502469